క్లుప్తంగా

'ఆర్గానిక్ కెమిస్ట్రీ' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం సహాయ ఆచార్యుడు పూసల క్రిస్టోఫర్ రచించిన 'కాంప్రహెన్సివ్ అప్రోచ్‌తో ఆర్గానిక్ కెమిస్ట్రీ' పుస్తకాన్ని సోమవారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కొత్త విషయాలు తెలుసుకునేందుకు ఈ పుస్తకం ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. పుస్తక రచయిత క్రిస్టోఫర్‌ను అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, విభాగాధిపతి ప్రొఫెసర్ పి.శ్యామల, విభాగపు ఆచార్యులు వి.సిద్దయ్య, జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ రంగంలో అనేక అవకాశాలు



బండి నగేష్‌ను సన్మానిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఫార్మసీ రంగంలో అనేక అవకాశాలున్నాయని అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైంటిస్ట్స్(ఏఏపీఎస్) ఫెలో అవార్డు గ్రహీత డాక్టర్ బండి నగేష్ పేర్కొన్నారు. ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం సౌజన్యంతో 'ఎంపవరింగ్ ఫ్యూచర్ ఇన్నోవేటర్స్' అనే అంశంపై ఫార్మసీ కాలేజీలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ ఫార్మా రంగంలో ఉన్న అవకాశాలను వివరించారు. అనంతరం ఆయనను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.గిరిజాశంకర్, అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, ఆచార్య రమణమూర్తి, ఆచార్య ఎ.కె.ఎం.పవార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనగర్‌లో ఫాగింగ్



ఫాగింగ్ చేస్తున్న మలేరియా సిబ్బంది

మద్దిలపాలెం: దోమల నిర్మూలనకు జీవీఎంసీ మలేరియా విభాగం విస్తృతంగా ఫాగింగ్ ప్రక్రియ నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా సోమవారం 15, 16, 22 వార్డుల్లో ఫాగింగ్ కార్యక్రమం చేపట్టారు. శివాజీపాలెం లక్ష్మీనగర్ కాలనీలో దోమల ఉధృత్తిని అరికట్టేందుకు ఫాగింగ్ చేశారు. ఈ ప్రక్రియకు కాలనీవాసులు సహకరించాలని సిబ్బంది కోరారు.

పోలీస్ శిక్షణ కేంద్రంలో తనిఖీలు

పీఎం పాలెం: రికార్డుల నిర్వహణలో అలసత్వం లేకుండా అప్‌డేట్‌గా ఉండాలని 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కె.వి.మురళీకృష్ణ సూచించారు. బక్కన్నపాలెంలోని ఏపీఎస్పీ పోలీస్ శిక్షణ కేంద్రంలో సోమవారం వార్షిక తనిఖీ చేశారు. కేంద్రం నిర్వహణలో అన్ని విభాగాలను పరిశీలించారు. ఆయన వెంట బెటాలియన్ అదనపు కమాండెంట్ సీహెచ్ వీఎస్ పద్మనాభ రాజు, అసిస్టెంట్ కమాండెంట్లు పి.దేవానందరావు, పి.సత్యం, వి.నారాయణ తదితర అధికారులున్నారు.

అడ్డగోలు నిర్మాణాలకు అడ్డుకట్టేది?

- ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు ప్రాంతాల్లో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు
- కనీస అనుమతులు నిల్
- ఫిర్యాదులపై స్పందించని టౌన్ ప్లానింగ్ అధికారులు



17వ వార్డు ఇందిరానగర్ గ్రీన్‌బెల్ట్‌లో శాశ్వత నిర్మాణాలు



సీఆర్‌జెడ్ పరిధిలోని 8 అడుగుల రోడ్డులో నిర్మిస్తున్న బహుళ అంతస్తులు



ఎంవీపీ కాలనీ సెక్టార్-6లో చేపడుతున్న బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణం

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ జోన్-3లో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటిపై టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వీరి తీరుపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు ప్రాంతాల్లో పలు చోట్ల పెద్ద ఎత్తున అనధికార కట్టడాలు వెలుస్తున్నాయి. జీవీఎంసీ ఆమోదించిన ప్లానింగ్‌కు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాల్సి ఉన్నా.. ఎక్కడా అది అమలు కావడం లేదు. చాలా నిర్మాణాలకు కనీస అనుమతులు లేవు. ఇరుకు రహదారుల్లో బహుళ అంతస్తులు కట్టేస్తున్నారు.

బిల్డర్లతో కుమ్మక్కే కారణం..!

ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు పరిధిలో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా చేపడుతున్నారు. వాటిపై చర్యలు తీసుకోవాలని జోన్-3 టౌన్ ప్లానింగ్ విభాగానికి ఎన్ని ఫిర్యాదులు అందుతున్నా.. అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. స్థానిక పట్టణ ప్రణాళిక ఉద్యోగులు పలువురు బిల్డర్లతో కుమ్మక్కవుతున్న కారణంగానే ఈ పరిస్థితి నెలకొందని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు.

- సీఆర్‌జెడ్ పరిధిలోని 19వ వార్డు లాసన్స్ బే కాలనీలో 10 అడుగుల రోడ్డు కూడా లేని మార్గంలో బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు అందినా పట్టించుకోవడం లేదు.
- 17వ వార్డు ఇందిరానగర్ గ్రీన్‌బెల్ట్‌లో బహుళ అంతస్తుల శాశ్వత నిర్మాణాలు దర్జాగా సాగుతున్నాయి. జీవీఎంసీ గతంలో ఇక్కడ గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని సర్వే చేసి చాలా షాపులు తొలగించాలని మార్కింగ్ కూడా చేసింది. ప్రస్తుతం ఇక్కడ జరుగుతున్న నిర్మాణాలను అడ్డుకోవాలని కాలనీవాసులు జీవీఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడంతోపాటు కోర్టును సైతం ఆశ్రయించారు. అయినప్పటికీ ఈ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయకుండా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.
- 20వ వార్డు చినవాల్తేరు అమ్మవారి వీధిలో జీ+2 నిర్మాణానికి మాత్రమే అనుమతి ఉన్నా.. ఇరుకు రోడ్డులో బహుళ అంతస్తులను అనధికారికంగా నిర్మిస్తున్నారు.
- ఎంవీపీ కాలనీ బుద్ధవనం ఎదుట నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనానిది ఇదే పరిస్థితి. వీటిపై స్థానికులు పెద్ద ఎత్తున టౌన్ ప్లానింగ్ విభాగానికి ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యం.

ఉన్నతాధికారులు స్పందించాలి

అక్రమ నిర్మాణాలకు సంబంధించి బిల్డర్లు, నిర్మాణదారులతో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు బేరసారాల ద్వారా పెద్ద ఎత్తున నగదు చేతులు మారడంతోనే వాటిపై ఉన్నతాధికారులు చర్యలకు ఆదేశించడం లేదంటూ ఫిర్యాదుదారులు చెబుతున్నారు. ఆయా అక్రమ కట్టడాలపై నేరుగా, ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులు చేసినట్లు వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ కమిషనర్, చీఫ్ సిటీ ప్లానర్లు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాలుష్య రహిత నగరంగా విశాఖ



ఆర్టీసీ బస్సు దిగుతున్న మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు నగర ప్రజలు సహకరించాలని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పిలుపునిచ్చారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం ఏపీఎస్‌ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుపోతున్న దృష్ట్యా జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను ఉపయోగించాలనే నిర్ణయం మేరకు అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణాను ఉపయోగిస్తున్నారన్నారు. ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో-జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా విశాఖ నగర పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు నిత్యం చేపడుతోందన్నారు.

కృష్ణా కాలేజీలో 'స్వచ్ఛతా హీ సేవా'



కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ, జాతీయ సేవా పథకం వారి ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన సదస్సు, ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తమ దత్తత గ్రామాల్లో ప్లాస్టిక్ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ మాట్లాడుతూ దేశంలో ప్లాస్టిక్‌ను నిరోధించి యువతీ యువకులు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ అధికారులు మాట్లాడుతూ దేశంలో ఉన్న యువత మై భారత్.. స్వచ్ఛ భారత్ దిశగా అడుగులు వేయాలన్నారు. స్వచ్ఛ భారత్ అని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ర్యాలీలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు పోల ఉమామహేశ్వరరావు, టి.శామ్యూల్ డేవిడ్‌రాజ్, జి.వి.ప్రతాప్, బి.లక్ష్మి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కె.రవిబాబు ఇతర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థల వివాదంపై పోలీసులకు ఫిర్యాదు



ఎస్ఎస్ఎన్ నగర్‌లో చదును చేసిన స్థలం

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పైనాపిల్ కాలనీ దరి ఎస్ఎస్ఎన్ నగర్‌లోని ఓ స్థల వివాదంపై ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. రామకృష్ణాపురంలో బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మాణంలో నివాసాలు కోల్పోయిన వారికి ఎస్ఎస్ఎన్ నగర్‌లో 50 చదరపు గజాల ఇంటి స్థలాలను జీవీఎంసీ అధికారులు కేటాయించారు. ఈ కాలనీలో మర్రిచెట్టు పక్కన మరికొందరు తమకు కూడా జీవీఎంసీ పట్టాలు ఇచ్చిందంటూ కొన్నాళ్ల కిందట పునాదులు వేశారు. వారి పట్టాలపై క్లారిటీ లేకపోవడంతో జీవీఎంసీ నిర్మాణాలను నిలిపేసింది. దీంతో వారు కోర్టును ఆశ్రయించారు. దీంతో కొన్నాళ్లు ఆ స్థలం ఖాళీగా ఉంది. ఆదివారం కాలనీలో కొందరు ఆ స్థలంలో ఉన్న పునాదులను తొలగించి చదును చేశారు. విషయం తెలుసుకున్న స్థలంపై కోర్టును ఆశ్రయించిన వ్యక్తులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామ సంఘ సభ్యులే స్థలాన్ని ఆక్రమించారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామ సంఘ సభ్యులు మాత్రం గ్రామంలో కొందరు కుర్రవాళ్లు ఆడుకోవడానికి ఆ స్థలాన్ని చదును చేశారని పోలీసులకు తెలియజేశారు. ఈ స్థలంపై సర్వే వివరాలు, నిజ నిర్ధారణ కోసం ఆరిలోవ పోలీసులు సోమవారం రూరల్ తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. మరో పక్క ఈ స్థలం చదును చేసిన విషయాన్ని జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సంబంధిత సచివాలయ సిబ్బంది తెలిపారు.

ఏయూలో ఆధునిక ల్యాబ్



అనలిటికల్ కెమిస్ట్రీ లేబొరేటరీని ప్రారంభిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీలో దివీస్ లేబొరేటరీ లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులు రూ.28 లక్షలతో ఆధునికీకరించిన అనలిటికల్ కెమిస్ట్రీ ల్యాబొరేటరీని సోమవారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, దివీస్ లేబొరేటరీస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎల్.వి.రమణతో కలిసి ప్రారంభించారు. ల్యాబ్‌లో ఆధునిక పరికరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా ల్యాబ్‌ను ఆధునీకరించి అందించిన దివీస్ యాజమాన్యాన్ని వీసీ ప్రశంసించారు. భవిష్యత్తులో ఇదే విధంగా సహకారం, తోడ్పాటును అందించాలని కోరారు. ఏయూ ఇంజినీరింగ్ కాలేజీలో గ్రీన్ కెమిస్ట్రీ కోర్సును నిర్వహిస్తున్నామని దివీస్ ప్రతినిధులకు వివరించారు. అక్కడ ప్రయోగశాలలు సైతం ఆధునికీకరించాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి దివీస్ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఏయూ త్వరలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ సేవలను ప్రారంభించనుందని చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ ఏయూలో పీజీ చేసిన ప్రతిభావంతులైన విద్యార్థులకు దివీస్ ల్యాబ్‌లో ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా దివీస్ ల్యాబ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎల్.వి.రమణ, జీఎం(పీ అండ్ ఏ విభాగం) వై.ఎస్.కోటేశ్వరరావులను వర్సిటీ తరఫున సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం అనలిటికల్ లేబొరేటరీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్, బీఓఎస్ చైర్మన్ ఆచార్య కె.బసవయ్య, దివీస్ ల్యాబ్ సీఎస్ఆర్ విభాగం మేనేజర్ డి.సురేష్‌కుమార్, పలువురు డీన్‌లు, ఏయూ అధికారులు, విశ్రాంత ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

చెప్పులు, షూల ప్రదర్శన రేపు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు దయాల్‌నగర్‌లోని దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ నెల 2న చెప్పుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి తెలిపారు. ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో ఉదయం 11 గంటల నుంచి మహిళలు, పురుషులకు చెందిన చెప్పులు, షూలు, స్పోర్ట్స్ షూలు విక్రయిస్తామన్నారు. వివరాలకు 96521 98411 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జార్జియన్ వర్సిటీ అడ్మిషన్ల కార్యాలయం ప్రారంభం



వివరాలు వెల్లడిస్తున్న జార్జియన్ యూనివర్సిటీ రెక్టార్ బుచాస్ వల్లి తదితరులు

ఎంవీపీకాలనీ: పెదవాల్తేరు డాక్టర్స్ కాలనీలో ఎస్ఈయూ జార్జియన్ జాతీయ విశ్వవిద్యాలయం అడ్మిషన్ల కార్యాలయాన్ని సోమవారం వర్సిటీ రెక్టార్ డాక్టర్ బుచాస్ వల్లి ప్రారంభించారు. ఇన్వోక్టా కెరీర్ కన్సల్టెన్సీ పేరిట ఈ ఆఫీస్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో రెక్టార్ మాట్లాడుతూ అనేక దేశాల్లోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో చదువుకునేందుకు భారతీయ విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారన్నారు. చాలా మందికి ఉన్నత విద్య ఆర్థిక భారంగా మారుతోందని, జార్జియన్ విశ్వవిద్యాలయంలో తక్కువ ఖర్చుతోనే ఎంబీబీఎస్, ఇంజినీరింగ్ వంటి కోర్సులు చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. జార్జియా గేట్ వే ఆఫ్ యూరప్‌గా ఉన్న నేపథ్యంలో అక్కడ ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు భవిష్యత్ అవకాశాలు పుష్కలంగా ఉంటాయన్నారు. ఇంటర్‌లో 60 శాతం మార్కులు పొంది నీట్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారు జార్జియన్ వర్సిటీలో ప్రవేశం పొందొచ్చని చెప్పారు. 80 శాతం మార్కులున్న వారికి స్కాలర్‌షిప్ సౌకర్యం కూడా ఉందన్నారు. డాక్టర్ చిరాగ్ మాట్లాడుతూ జార్జియన్ వర్సిటీలో ఎంబీబీఎస్ చదివిన విద్యార్థులు ఇండియన్ మెడికల్ కౌన్సిల్ నిర్వహించే మెడికల్ ప్రాక్టీస్ అర్హత పరీక్షల్లో సునాయాసంగా విజయం సాధిస్తున్నారన్నారు. ఇప్పటికే జార్జియన్ వర్సిటీలో 4 వేల మంది భారతీయ విద్యార్థులు చదువుతున్నట్లు తెలిపిన ఆయన.. విశాఖలో కార్యాలయం ఏర్పాటు ద్వారా ప్రవేశాలు మరింత పెరగనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, వివేకానందమూర్తి, ఆచార్య చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కన్నేశారు.. అమ్మేశారు..!



సామాజిక భవనం



రవీంద్రనగర్‌లో అమ్మేసిన సామాజిక భవనానికి చెందిన ఖాళీ స్థలం

- రవీంద్రనగర్‌లో సామాజిక భవనం స్థలాన్ని విక్రయించేసిన సంఘ సభ్యులు
- ఎమ్మెల్యే అండదండలతోనే ఆక్రమణలు, విక్రయాలు
- పెద్ద చర్చకు దారితీసిన వ్యవహారం

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం అక్రమాలకు నిలయంగా మారిపోతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక గెడ్డలు, ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఇటీవల తోటగరువుకు చెందిన కొందరు టీడీపీ నాయకులు పెదగదిలి వద్ద గెడ్డ భాగంతోపాటు పశు సంవర్థక శాఖకు చెందిన ఖాళీ స్థలాన్ని ఆక్రమించేశారు. గాంధీనగర్, బాలాజీనగర్, శ్రీహరినగర్ ప్రాంతాల్లో గెడ్డల అంచున ఖాళీ స్థలాలకు కొందరు దొంగ పటాస్‌ట్ల సృష్టించి విక్రయానికి పెట్టారు. ఇప్పుడు 10వ వార్డు రవీంద్రనగర్‌లో సంఘ కమిటీ మరింత ముందడుగు వేసింది. ఈ సంఘ కమిటీ సభ్యులు జీవీఎంసీ సామాజిక భవనానికి చెందిన ఖాళీ స్థలాన్ని పూర్తిగా అమ్మేశారు. గ్రామ సంఘం ఆధ్వర్యంలో రవీంద్రనగర్ ఆఖరి బస్‌స్టాప్ వద్ద కల్యాణ మండపం నిర్మిస్తున్నారు. దీని కోసం ఖర్చు చేయడానికి జీవీఎంసీకి చెందిన ఖాళీ స్థలాన్నే వీరు అమ్మేయడం విశేషం. ఈ స్థలం అమ్మకం వ్యవహారం ప్రస్తుతం పెద్ద చర్చకు దారితీసింది.

కారు చవకగా స్థల విక్రయం..

రవీంద్రనగర్‌లో జీవీఎంసీకి చెందిన సుమారు 400 చదరపు గజాల స్థలం 15 ఏళ్ల కిందట సామాజిక భవనం కోసం కేటాయించింది. సుమారు 10 ఏళ్ల కిందట అప్పటి మూడో వార్డు కార్పొరేటర్ నల్లూరి భాస్కరరావు జీవీఎంసీ నిధులతో వార్డులో సుమారు 200 చదరపు గజాల స్థలంలో సామాజిక భవనం నిర్మించారు. మిగిలిన స్థలాన్ని ఇక్కడ కార్యక్రమాల కోసం ఖాళీగా వదిలేశారు. దానిపై సంఘ కమిటీ సభ్యుల కన్నుపడింది. కొన్నాళ్ల క్రితం సామాజిక భవనం నుంచి ఈ ఖాళీ స్థలాన్ని వేరు చేసి మధ్యలో నాలుగడుగులు ఎత్తులో గోడ నిర్మించేశారు. ఇప్పుడా 200 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని వేరేచోట నిర్మిస్తున్న కల్యాణ మండపం పేరుతో అమ్మేశారు. ఆ సంఘంలో ఉన్న వైస్ ప్రెసిడెంట్‌కే కారు చవకగా రూ.47 లక్షలకు స్థలాన్ని విక్రయించేశారు.

స్థలం విలువ రూ.1.40 కోట్ల పైమాటే..

ఇక్కడ చదరపు గజం ధర రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకు ఉంది. ఈ లెక్కన ఆ స్థలం రూ.1.40 కోట్ల నుంచి రూ.1.60 కోట్ల ధర ఉంటుంది. ఆ సంఘంలో కార్యవర్గ సభ్యుడికి అతి తక్కువ ధరకు విక్రయించడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా సామాజిక భవనాలు అందరికీ చెందినవి. ప్రజా అవసరాల కోసం జీవీఎంసీ కేటాయించిన ఖాళీ స్థలాలు, భవనాలను వ్యక్తిగతంగా గాని, సంఘాలకు గాని సొంతానికి ఉపయోగించుకునే హక్కు లేదు. ఈ సంఘం కమిటీ మాత్రం దర్జాగా జీవీఎంసీ స్థలాన్ని అమ్మేయడం చర్చనీయాంశమైంది. స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అండదండలు, కనుసన్నలతోనే ఈ ప్రాంతంలో గెడ్డలు, జీవీఎంసీకి చెందిన ఖాళీ స్థలాల ఆక్రమణలు, విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆక్రమణలు విచ్చలవిడిగా జరుగుతున్నాయంటున్నారు. సామాజిక భవానికి చెందిన ఖాళీ స్థలం విక్రయంపై జీవీఎంసీ అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

యువత కృషితో పర్యావరణ పరిరక్షణ

ఎంవీపీకాలనీ: పర్యావరణ పరిరక్షణకు యువత కృషి చేయాలని జీవీఎంసీ ప్రాజెక్టు ఇంజినీర్ (సస్టైనబుల్ రిజిలియన్స్ యూనిట్) వివేక్ కోరారు. ఎంవీపీ కాలనీ వీఎంసీ కళాశాలలో వ్యూస్ ఎన్‌జీవో, ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ సంయుక్తంగా యూత్ ఫర్ క్లైమేట్ చేంజ్ అంశంపై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పర్యావరణ హితంగా జీవించడం అలవాటు చేసుకోవాలన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, కాలుష్యానికి హాని కలిగించని రోజువారి కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. తద్వారానే భావి ప్రపంచానికి మంచి వాతావరణం, ప్రకృతి లభిస్తాయన్నారు. ఇందుకు యువత, విద్యార్థులు వారధులగా పనిచేయాలన్నారు. ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు విద్యార్థి దశ నుంచే నడుం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జె.వి.రత్నం, వ్యూస్ సంస్థ కో-ఆర్డినేటర్ జె.రాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్ నిర్వాహకులతో కళాశాల విద్యార్థులు

ఆశ్రమ భూములను స్వాధీనం చేసుకోవాలి

మహారాణిపేట: భూకబ్జదారుల గుప్పిట్లో ఉన్న శ్రీ శాంతి ఆశ్రమం భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాణిజ్య సముదాయాలను తక్షణమే తొలిగించాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ కోరారు. సోమవారం కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. 19వ వార్డు లాసన్స్‌బే కాలనీలో సముద్రతీరానికి ఆనుకుని శ్రీ శాంతి ఆశ్రమానికి సంబంధించిన సుమారు పదెకరాల భూమి ఉందన్నారు. ప్రజలకు విద్య, వైద్యం అందించేందుకు స్వామి ఓంకార్ ఇచ్చారని తెలిపారు. ఆయన స్వర్గీయులైన తర్వాత కొందరు ప్రైవేట్ వ్యక్తులు కొంత భూమిని అధీనంలోకి తీసుకున్నారని, కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని ఆధునిక ఫిష్ మార్కెట్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

కారు బీభత్సం ఘటనపై కేసు నమోదు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు కె.నగరపాలెం దరి గోవుపేట వద్ద ఆదివారం రాత్రి జరిగిన కారు బీభత్సం ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ సుధాకర్ తెలిపారు. మీసాల వెంకట్ అనే వ్యక్తి మద్యం తాగి వాల్వో కారు అతి వేగంగా నడపడం వల్ల ఈ ప్రమాదం సంభవించిందన్నారు. ప్రస్తుతం సీసీ కెమెరాల ఆధారాలు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.